క్లుప్తంగా

కృష్ణా కాలువలో గుర్రపుడెక్క తొలగింపు



గ్రీన్ సిటీ వద్ద కాలువలో పూడిక తొలగింపు

ఏలూరు రూరల్ : కృష్ణాకాలువలో గుర్రపుడెక్క తొలిగింపు పనులు సోమవారం చేపట్టారు. స్థానిక గ్రీన్‌సిటీ నుంచి తూర్పులాకుల వరకు కాలువలో పేరుకుపోయిన గుర్రపుడెక్క, చెత్త చెదారం తొలగిస్తున్నారు. హనుమాన్ నగర్ పరిసరాల్లో పంట కాలువకు అడ్డుగా ఉన్న పూడిక తొలగించడంతో కాలువలో నీరు కిందకు పారడం ప్రారంభమైంది. గ్రీన్ సిటీ వంతెన వద్ద నుంచి ఉదయం 6 గంటలకు ప్రారంభించిన పనులు పాత బస్టాండ్ వద్ద వరకు కొనసాగాయి. దీంతో కాలువ పూడిక తొలిగి సాగునీరు సకాలంలో అందుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు గ్రామాల్లో పంటకాలువలో పూడికా తీయించాలని వారు కోరుతున్నారు.

శాశ్వత హక్కు కల్పించాలి

ఏలూరు రూరల్: చెరువులపై రజకులకు శాశ్వత హక్కు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు కట్లయ్య ఓ ప్రకటనలో కోరారు. సోమవారం ఏలూరులోని రజక సంఘం భవనంలో నిర్వహించిన సభ్యుల సమావేశ వివరాలను ఆయన వెల్లడించారు. ఉపాధి హామీ పథకంలో గ్రామాల్లో చెరువుల్లో పూడిక తీయించాలని, చెరువుల ఆక్రమణలను తొలగించి రజకులకు అప్పగించాలని కోరారు.

ఘనంగా వాసుదేవస్వామి కల్యాణ మహోత్సవం



వాసుదేవస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పవర్‌పేట శ్రీదేవి, భూదేవి సమేత వాసుదేవస్వామి దేవస్థానంలో స్వామి కల్యాణ మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం నిత్య హోమాలు నిర్వహించి బలిహరణ పూజలు చేశారు. రాత్రి స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తీర్థ ప్రసాద వితరణ చేశారు. అర్చకులు కందుకూరి వేంకట విజయ కుమార్ ప్రత్యేక పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి ఎం.రామాంజనేయులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

సీఎం జగన్ పాలనా దక్షతకు నిదర్శనం

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు విజయవంతం హర్షణీయం
- వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నూర్జహాన్ పెదబాబు చిత్రంలో ఇడా చైర్మన్ ఈశ్వరి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, పార్టీ నగర అధ్యక్షుడు శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ చిరంజీవి తదితరులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చే క్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపుమేరకు విశాఖపట్నంలో నిర్వహించిన రెండు రోజుల గ్లోబల్ ఇన్వెస్టర్స్ సదస్సు విజయవంతం కావడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడులు, పరిశ్రమల రాకకు ఏర్పడిన అనుకూల వాతావరణం చూసి రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు పండుగ వాతావరణంలో ఉన్నారని చెప్పారు. గతంలో ఇంత భారీ స్థాయిలో పెట్టుబడులు వచ్చిన చరిత్ర లేదన్నారు. అంబానీ, అదానీ, గ్రంధి మల్లికార్జునరావు వంటి అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టడానికి సుముఖత వ్యక్తం చేయడం సీఎం జగన్ పరిపాలనా దక్షతకు నిదర్శనమని తెలిపారు. ఈ స్థాయిలో సదస్సు విజయవంతమైనా పచ్చ మీడియా విష ప్రచారం చేయడం పారిశ్రామికవేత్తలను అవమానించడమేనని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో అమరావతిని రాజధానిగా ప్రకటించడంతో అక్కడ పారిశ్రామిక అభివృద్ధికి అవకాశంలేకే అప్పుడు పరిశ్రమలు రాలేదని ఆరోపించారు. విశాఖపట్నం వేదికగా జరిగిన సదస్సు ద్వారా దాదాపు రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు రావడాన్ని టీడీపీ నాయకులు, పచ్చ మీడియా జీర్ణించుకోలేకపోతోందని ఎద్దేవా చేశారు.

అభివృద్ధి, ఉపాధి అవకాశాలకు కృషి

ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సుస్థిర అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి సీఎం జగన్ ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. విశాఖ వేదికగా 352 ఒప్పందాలు చేసుకోవడం ద్వారా రాష్ట్రంలో 6 లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మధ్యాహ్నపు ఈశ్వరి బలరాం మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రాన్ని అభివృద్ధికి ఉదాహరణగా నిలపడంలో సఫలమయ్యారన్నారు. విశాఖలో జరిగిన ఒప్పందాలతో రాష్ట్ర ప్రజలకు దేశ వ్యాప్తంగా విశేష గౌరవం లభించిందని చెప్పారు. రాష్ట్రానికి రాబోయే పరిశ్రమల్లో కొన్ని ఏలూరు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటుచేసేలా ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఎంపీ కోటగిరి శ్రీధర్ చొరవ తీసుకోవాలని కోరారు. నగర డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రానికి ఇన్ని పరిశ్రమలు రావడం గొప్ప విషయమన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు అమరావతిలో తాత్కాలిక కట్టడాలు కట్టి వేలకోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ భారీ విగ్రహాన్ని ఏర్పాటుకు ఒక్క ఇటుకకూడా పేర్చలేని చంద్రబాబు గడిచిన రెండేళ్లలోనే విగ్రహ నిర్మాణాన్ని సగంమేర పూర్తి చేసిన సీఎం జగన్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఏలూరు ఎమ్మెల్యే నాని నగరానికి మెడికల్ కళాశాల, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంలో విశేష కృషి చేశారని వివరించారు. ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవి మాట్లాడుతూ సీఎం జగన్ విద్యావంతులున్న రాష్ట్రంగా తీర్చిదిద్దడంతో పారిశ్రామికవేత్తలు ఇక్కడ పెట్టుబడులకు సుముఖత వ్యక్తం చేశారన్నారు. సీఎం జగన్ చేస్తోన్న అభివృద్ధిని చూసైనా గత పాలకులు తమ తప్పులను సరిదిద్దుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. సమావేశంలో నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్నుల జాన్ గురునాథ్, వైసీపీ నాయకులు ఎంఆర్‌డీ బలరాం తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థ గ్రీవెన్సెస్

ఏలూరు టౌన్: ఏలూరు నగర ప్రజల సమస్యల పరిష్కారానికి కార్పొరేషన్ అధికారులు ప్రత్యేకంగా గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేసినట్టు నగర కమిషనర్ సంక్రాంతి వెంకట కృష్ణ తెలిపారు. ప్రజలు ఆయా సమస్యలు, సందేహాల నివృత్తికి ప్రతి రోజు ఉదయం ఆరు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు టోల్‌ఫ్రీ నెంబర్ 1800 425 4287, గ్రీవెన్సెస్ 08812 232101, వాట్సాప్ సెల్ నెంబర్ 89789 99955లో తెలియజేయవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జంగారెడ్డిగూడెం: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై సాగర్ బాబు తెలిపారు. మండలంలోని వెంకటరామానుజపురానికి చెందిన మారెడ్డి వీరవెంకట నాగ సత్యనారాయణ (20) గత నెల 22వ తేదీ రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో కలుపు మందు తాగాడు. అతనిని గమనించిన కుటుంబసభ్యులు జంగారెడ్డిగూడెంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి, మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేయగా, గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. ఆ మేరకు బాబాయ్ వెంకట సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేరగాళ్లపై కఠిన వైఖరి

- జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ
- స్పందనలో వినతుల స్వీకరణ



జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు పోలీస్ శాఖ నిత్యం సన్నద్ధంగా ఉంటుందని, నేరగాళ్లపై కఠినవైఖరి అవలంబిస్తామని ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో ఆయన వినతులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నేరస్తులపై నిఘా మరింత పెంచుతామని, అరాచక శక్తులను అణిచివేసేందుకు చర్యలు చేపడతామని చెప్పారు.

స్పందన వినతులు ఇవే:

- ప్రేమ పేరుతో పెద్దలకు తెలియకుండా వివాహం చేసుకుని ఇప్పుడు వరకట్నం కోసం వేధింపులకు గురిచేస్తూ చంపేందుకు ప్రయత్నం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని నూజివీడు పట్టణానికి చెందిన ఓ మహిళ కోరారు.
- తనకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.50 లక్షలు తీసుకుని మోసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏలూరు శనివారపుపేటకు చెందిన ఓ మహిళ కోరారు.
- ఏలూరులోని ఓ వ్యక్తి వద్ద చిట్టీలు కట్టానని, ఇంకా రెండు చిట్టీలు కట్టాల్సిన క్రమంలో రూ.1.20 లక్షలు కరోనా సమయంలో అప్పుగా తీసుకుని ప్రతి నెలా రూ.20 వేలు చొప్పున చెల్లించినా ఇంకా బాకీ ఉన్నారంటూ చెక్కులు, నోట్లతో బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని భీమడోలు నుంచి ఓ మహిళ కోరారు.

రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం కావాలి

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లపై కలెక్టర్ వెంకటేష్



ఏలూరు(మెట్రో): రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ఉండాలని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం నాబార్డ్ ఆర్థిక సాయంతో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్స్ ఏర్పాటు ప్రతిపాదనలపై నాబార్డ్ జిల్లా మానిటరింగ్ సమావేశంలో అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. వ్యవసాయ, ఆహార ఉత్పత్తులకు మంచి ధర లభిస్తుందనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. ఆహార ఉత్పత్తులకు మెరుగైన ధర, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పన లక్ష్యంగా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ఉండాలని, ఇవి సక్రమంగా అభివృద్ధి బాటలో ఉన్నప్పుడే పథకానికి సార్థకత ఏర్పడుతుందని అన్నారు. ఈ యూనిట్ల ఏర్పాటులో ముడిసరుకు లభ్యత నుంచి ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాల కల్పన వరకు నాబార్డ్, సంబంధిత శాఖల అధికారులు రైతు ఉత్పత్తి సంస్థల ప్రతినిధులకు శిక్షణ అందించాలని అన్నారు. జిల్లాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి రైతు ఉత్పత్తి సంస్థలకు అనుమతి మంజూరు చేసినట్టు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో నాబార్డ్ సంస్థ డీడీఎం టి.అనిల్‌కాంత్, వ్యవసాయ శాఖ జాయింట్ కలెక్టర్ వై.రామకృష్ణ, జిల్లా పంచాయతీ అధికారి, మత్స్య శాఖ ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ మల్లికార్జునరావు, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ ఎస్ఎస్ వెంకటేశ్వరరావు, ఉద్యానవనాలు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.శాంతి, పశుసంవర్ధక శాఖ, మార్కెటింగ్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా జనార్ధన స్వామి రథోత్సవం



జనార్ధనస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు



రథోత్సవంలో జనార్ధనస్వామి వారు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారం భూ, నీళా సమేత జనార్ధన స్వామి దేవస్థానంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి వారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, విష్ణు షమస్రనామ పారాయణ చేసి స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణగావించారు. మధ్యాహ్నం నుంచి స్వామి వారి రథోత్సవం ప్రారంభించి రాత్రి వరకు నగర వీధుల్లో స్వామి వారి దర్శనం ప్రజలకు కల్పించారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన రథోత్సవం వైఎంహెచ్‌ఏ హాలు బిర్లా భవన్ సెంటర్, మెయిన్ బజార్, గడియార స్తంభం సెంటర్, పెద్ద పోస్టాఫీస్, పెరుగుచెట్టు సెంటర్, పేరయ్య కోనేరు మీదుగా తిరిగి దేవస్థానం వద్దకు చేరింది. దారి పొడవునా భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వంగల పవన్ కుమార్ ఆచార్య విశేష పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి గుబ్బల రామపెద్దింట్లరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ఎంపీ శ్రీధర్‌ను కలిసిన మునునూరు జెడ్పీటీసీ ప్రతాప్

దెందులూరు: నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు ఆధ్వర్యంలో ముసునూరు మండలంలో అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలు లక్ష్యాలకు అనుగుణంగా కొనసాగుతున్నాయని ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్ అన్నారు. సోమవారం ఎంపీ కోటగిరి శ్రీధర్ క్యాంపు కార్యాలయంలో ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ముసునూరు మండలానికి అత్యధిక ప్రాధాన్యత నిచ్చి సమస్యల పరిష్కార లక్ష్యంగా ఎమ్మెల్యే సహాయ సహకారాలు అందిస్తున్నారని అన్నారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, నెలకొన్న సమస్యలను ఎంపీకి వివరించారు. నూజివీడు నియోజకవర్గం, ముసునూరు మండల అభివృద్ధికి తన సహకారం అందిస్తానని ఎంపీ అన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	22	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	32	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	32	ములక్కాడలు	10-12
బెండకాయలు	54	కంద	40
పచ్చిమిర్చి	34	బీట్‌రూట్	36
కాకర కాయలు	30-36	కీరా దోస	40
బీరకాయలు	48	ఫ్రెంచ్‌బీన్స్	54
బీరకాయలు (పందిరి)	60	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	30	పాలకూర	10
దొండకాయలు	40	చుక్కకూర	10
బంగాళదుంపలు	18	తోటకూర	10
ఉల్లిపాయలు	20	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	30-48	బఠాణీ	50
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	64
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	28

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	25
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	33
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	32
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	31
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు - తిరుపతి	16.00	4830	26

లింగ సమానత్వం సమాజాభివృద్ధికి అవసరం



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): లింగ సమానత్వం సమాజ అభివృద్ధికి అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో రాజేశ్వరి మాట్లాడారు. స్త్రీల భద్రత, సంక్షేమం కోసం అనేక చట్టాలున్నాయని, వీటిని సక్రమ మార్గంలో ఉపయోగించుకుని అభివృద్ధి పథంలో పయనించాలని సూచించారు. వరకట్న నిరోధక చట్టం, గృహహింస చట్టం, బాల్య వివాహాలు నిరోధించడం, న్యాయసేవాధికార సంస్థ అందించే ఉచిత సేవలు పైన అవగాహన కలిగించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.గిరిబాబు మాట్లాడుతూ ప్రతి వ్యక్తీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడంలో తల్లి పాత్ర ఎనలేనిదన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న పీవీఎస్ మునీశ్వరరావు మాట్లాడుతూ స్త్రీల రక్షణ చట్టాలను వివరించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షలు, క్రీడల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో లెక్చరర్ టీవీఎస్ పద్మావతి, పీఆర్ కావ్య శ్రీ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సేవలో అధికారుల పాత్ర కీలకం



అవార్డులతో సత్కరిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ప్రజా సేవలో ప్రభుత్వ అధికారుల పాత్ర కీలకమని రోటరీ క్లబ్ ఏలూరు అధ్యక్షుడు చెన్నా నాగభూషణ రావు పేర్కొన్నారు. స్థానిక అశోక్ నగర్‌లోని అంబికా వీవీ కన్వెన్షన్ హాలులో రోటరీ ఒకేషనల్ సర్వీస్ అవార్డుల ప్రదాన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. తమ కర్తవ్యాన్ని విస్మరించకుండా నిష్పాక్షిక సేవలు అందించడం ద్వారా ప్రజల మన్ననలు పొందడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ సీవీఎస్ పైడేశ్వర రావు, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ దంతి సునీత, జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ పెదపాటి శ్రీనివాస్, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎస్వీఆర్ వరప్రసాద్, తూర్పువీధి సంతాన వేణుగోపాల స్వామి దేవస్థానం ప్రధాన అర్చకుడు వేదాంతం విజయవేంకట రామానుజాచార్యులును ఘనంగా సత్కరించి పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ పాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ డి.దామోదరరావు, అసిస్టెంట్ గవర్నర్ కాకరపర్తి కృష్ణయ్య, సీఆర్ఆర్ కళాశాల ప్రొఫెసర్ పీసీ స్వరూప్, ఏలూరు రోటరీక్లబ్ కార్యదర్శి వంకదారు శిరీష, ఒకేషనల్ సర్వీస్ డైరెక్టర్ శలా రాజాబాబు, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా కైకలూరు రోడ్డు, వంతెన పనులు



మహేశ్వరపురం శివారున నిర్వహిస్తున్న కైకలూరు రోడ్డు పనులు



కొనసాగుతున్న శ్రీపర్రు వంతెన నిర్మాణ పనులు

ఏలూరు రూరల్: ఏలూరు మండలం దెందులూరు నియోజకవర్గం పరిధిలో కైకలూరు రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.20.72 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఇందుకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి తోడు కావడంతో అధికారులు, కాంట్రాక్టర్ పనుల వేగంగా పెంచారు. ఏలూరు, కైకలూరు ప్రధాన రోడ్డు 80 శాతం పూర్తి కావచ్చింది. సుమారు 7 కిలో మీటర్ల దూరం గల ఈ రోడ్డు అభివృద్ధికి ప్రభుత్వం రూ.6.64 కోట్లు వెచ్చిస్తోంది. ఇందులో శ్రీపర్రు గ్రామం వద్ద సీసీరోడ్డు నిర్మాణం పూర్తి కావచ్చింది. మహేశ్వరపురం ఆవల రోడ్డు మార్జిన్ బురదనేల వద్ద రోడ్డు కోతకు గురికాకుండా రివెంట్‌మెంట్, నీటి పారుదలకు కల్వర్టులు నిర్మిస్తున్నారు. శ్రీపర్రు కాజ్‌వే స్థానంలో వంతెన నిర్మిస్తున్నారు. వంతెనకు అడ్డంకిగా ఉన్న ఆక్రమణలు తొలిగించిన సంగతి తెలిసిందే. రూ.కోటితో చేపట్టిన కొక్కిరాయిలంక ప్రధాన రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, కొక్కిరాయిలంక, పైడిచింతపాడు రోడ్డు పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి.

లక్ష్మీదేవి అలంకారంలో పెద్దింట్లమ్మ

పెదపాడు: మండలంలోని వీరమ్మకుంట గ్రామంలోని పెద్దింట్లమ్మ వారిని లక్ష్మీదేవిగా సోమవారం అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసారు. గణపతికి గరికతో పూజలు చేసారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను వితరణ చేసారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు. రాత్రి 7 గంటల నుంచి సినీ మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సందర్శించారు... సరిచేశారు

పెదవేగి : ఆకస్మిక తనిఖీలో భాగంగా తాళ్లగోకవరం పాఠశాలను ఎంపీడీఓ సందర్శించారు. అక్కడ ఉన్న సమస్యలను సరిచేశారు. పెదవేగి మండలం తాళ్లగోకవరం ఎంపీయూపీ పాఠశాలను పెదవేగి ఎంపీడీఓ గంజి రాజ్‌మనోజ్ వారం రోజుల క్రితం పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థులకు మినరల్ వాటర్ అందించే వాటర్ ప్లాంట్ పాడైపోయిందని, బాలికల టాయిలెట్ల తలుపులు ఊడిపోయాయని, తరగతి గదుల్లో గ్రీన్ చాక్ బోర్డులు పాడైపోయాయని గుర్తించి వాటిని తక్షణమే ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ ఇటీవల ఆదేశించారు. ఎంపీడీఓ ఆదేశాలపై స్పందించిన విద్యా శాఖ, స్థానిక ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఆర్వో వాటర్ ప్లాంట్‌తో పాటు, టాయిలెట్ల తలుపులు మరమ్మతులు చేశారు. తరగతి గదుల్లో గ్రీన్ చాక్ బోర్డులు కూడా ఏర్పాటు చేశారని ఎంపీడీఓ రాజ్ మనోజ్ తెలిపారు. ఇచ్చిన గడువులోగా పనులు పూర్తి కావడంతో ఆయన సంతృప్తి వ్యక్తం చేసి, సిబ్బందిని అభినందించారు.